సమస్యల హోల్టు


బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

- ఆగిరిపల్లి బస్టాండ్‌లో సౌకర్యాలు శూన్యం
- పనిచేయని తాగునీటి కుళాయి
- చెత్తాచెదారంతో అపరిశుభ్ర వాతావరణం
- కంపు కొడుతున్న బస్టాండ్ ఆవరణ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి బస్టాండ్‌లో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆగిరిపల్లి బస్టాండ్ నుంచి విజయవాడ, నూజివీడు, హనుమాన్ జంక్షన్, గన్నవరంతోపాటు మండలంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం లేకపోవడం, బస్టాండ్ ఆవరణ అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. బస్టాండ్ లోపల ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా మారింది. బస్సులు లోపలికి రాకుండా రోడ్డుపై నిలిపి ప్రయాణికులను దించి వేస్తున్నారు. బస్టాండ్‌లో రాత్రిపూట లైట్లు వెలగకపోవడంతో మద్యం, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

విచారణ కౌంటర్ నామమాత్రమే..

బస్సుల సమాచారాన్ని తెలిపే వ్యక్తులు విచారణ కౌంటర్‌లో లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల వేళల కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక అవస్థలు పడుతున్నారు. చుట్టుపక్కల ఉన్న బడ్డీ దుకాణాల్లో బస్సుల సమాచారాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. బస్టాండ్ ప్రహరీ మొత్తం ధ్వంసం అయిపోయింది. దీంతోపాటు బస్టాండ్ ఆవరణ అంతా రాళ్లు పైకి లేచి గుంతలమయంగా మారింది. బస్టాండ్ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలు నిరుపయోగంగా మారడంతో తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఆగిరిపల్లి బస్టాండ్‌లో సౌకర్యాలను మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారిన బస్టాండ్ ప్రాంతం


బస్టాండ్‌లో పనిచేయని తాగునీటి పంపులు

సమస్యలు పరిష్కరిస్తాం

ఆగిరిపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లోని తాగునీటి సమస్యను, విద్యుత్ లైట్లు వెలగకపోవడాన్ని పరిశీలించి పరిష్కరిస్తాం. బస్టాండ్ పక్కనే ఉన్న దుకాణదారుల వల్లే ప్రహరీ పడిపోయింది. అతను కొన్ని రోజుల్లో నూతనంగా గోడను నిర్మిస్తానని చెప్పాడు. నిర్మించకపోతే చర్యలు తీసుకుంటాం. బస్టాండ్‌లో ప్రయాణికులకు విచారణ కౌంటర్లో సమాచారం తెలిపేందుకు వారం రోజుల్లో వ్యక్తిని నియమిస్తాం.

పవన్‌కుమార్,
ఆర్టీసీ నూజివీడు డిపో మేనేజర్

భౌ..భౌలతో బెంబేలు

- గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు
- గ్రామస్తులపై దాడులు
- బయటకు రావాలంటేనే భయపడుతున్న ప్రజలు


మైలవరంలోని అంతర్గత రహదారిలో సంచరిస్తున్న కుక్కల గుంపు

మైలవరం: గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామాల్లోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ పాదచారులు, వాహనదారులపై దాడి చేస్తున్నాయి. వాహన చోదకుల వెంట పడుతుండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత ఐదు నెలలుగా 8 మంది వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు. ఐదుగురు కుక్క కాటుకు గురై స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వీధి కుక్కల సంఖ్య పెరిగిపోతుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉన్నా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో రెండు రోజుల కిందట ఒక బాలుడిపై కుక్క దాడి చేసి గాయపర్చింది. ఆదివారం కుక్క వెంట పడటంతో వాహన చోదకుడు ప్రమాదానికి గురయ్యాడు. వెలుగులోకి రాని ఇటువంటి ఘటనలు ఎన్నో ఉన్నాయి. గతంలో మైలవరంలో పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో అధికారులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి కుక్కలను పట్టించి వాహనంలో తరలించి దూరంగా ఉన్న పంగిడికి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కుక్కలను పట్టించి దూరప్రాంతాల్లోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో కుక్కలను బంధించి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేవారు. మళ్లీ అటువంటి చర్యలు తీసుకుని కుక్కల ఉత్పత్తిని తగ్గించి ప్రజలను కుక్కల బారి నుంచి కాపాడాలి.

– ఐ. వెంకటరత్నం, తోలుకోడు

అంధకారంలో ఇబ్రహీంపట్నం రైతు బజార్

మూడు నెలలుగా విద్యుత్ బిల్లుల బకాయిలు


చీకట్లో ఇబ్రహీంపట్నం రైతుబజారు

ఇబ్రహీంపట్నం: మార్కెటింగ్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో ఇబ్రహీంపట్నంలోని రైతు బజార్‌లో అంధకారం అలముకొంది. మూడు నెలల నుంచి విద్యుత్ బిల్లులు పెండింగ్ ఉండటంతో విద్యుత్ శాఖాధికారులు ఫీజులు తీసుకువెళ్లారు. దీంతో ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన దుకాణదారులు రాత్రికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని చీకట్లోనే అమ్మకాలు జరిపారు. సెలవు రోజు కావడంతో స్థానిక ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, మండల ప్రజలు కొనుగోలుకు వచ్చి చిమ్మచీకట్లో ఇబ్బందులు పడ్డారు. ప్రతి నెలా సుమారు రూ.60 వేల వరకు ముక్కుపిండి అద్దె వసూలు చేస్తున్న మార్కెటింగ్ శాఖాధికారులు కరెంట్ బిల్లు మూడు నెలలు పెండింగ్‌లో ఉంచడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

జెండా పండుగ జరుపుకోవాలి

మైలవరం: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మైలవరం నియోజకవర్గంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని బీజేపీ మైలవరం నియోజకవర్గ కన్వీనర్ పి. వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో బీజేపీ మండల సమావేశం మండల అధ్యక్షుడు తోట నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆగస్టు 13న జెండా ఇంటిపై ఎగురవేసి 14, 15 వరకు మూడు రోజుల పాటు జెండా పండుగను జరుపుకోవాలని నాయకులు సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహాను భావులు పోరాడి తమ ప్రాణాలు త్యాగం చేశారని వివరించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఆరేపల్లి నాగరాజు, యువ మోర్చా నాయకులు జె. నరేంద్ర, ఎ. వంశీ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండలం కిలేశపురం గ్రామానికి చెందిన రైతు ఉండవల్లి వెంకటేశ్వరరావు ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబానికి సొసైటీ నుంచి రూ. లక్ష బీమా మంజూరైంది. మృతుడి భార్య లక్ష్మికి బీమా చెక్కును ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదివారం గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో అందజేశారు.

దోమల నివారణకు చర్యలు

వావిలాల(తిరువూరురూరల్): వావిలాల పంచాయతీ పరిధిలో ఆదివారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని పలు వార్డుల్లో దోమల బెడద తీవ్రంగా ఉండటంతో సర్పంచి అలవాల రాధ, కార్యదర్శి రాజు పర్యవేక్షణలో సిబ్బంది ఫాగింగ్ చేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బైక్‌పై వెళుతున్న వ్యక్తి కొండపల్లి బీకాలనీ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీకి తరలించారు. అతను స్పృహలో లేకపోవడంతో వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ రాజకుమారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అధికారులు ప్రజల నుంచి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే.. వాటిని పేర్కొన్న గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలోని దాసాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఇరువురు దాతలు విరాళాలు అందజేశారు. జక్కేపల్లి మురళీకృష్ణ రూ.50,116, కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్ సోమవరపు సీతారామాంజనేయులు రూ.50,116 విరాళాన్ని ఆలయ నిర్మాణం నిమిత్తం వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, గంగరాజు, అర్చకులు రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

27న కృష్ణా నదీ జలాల కోసం పాదయాత్ర

సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్


మాట్లాడుతున్న దోనేపూడి శంకర్

తిరువూరు: గిరిజన తండాలకు ఫ్లోరైడ్, సిలికాన్ రహిత తాగునీటి సరఫరాలో పాలకులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎ. కొండూరు, గంపలగూడెం, తిరువూరు మండలాల్లో కిడ్నీ బాధితులు అధికంగా ఉన్నందున కృష్ణా నదీజలాలను సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడటమే కాక, తండాలలో రక్షిత మంచినీరందక కిడ్నీ వ్యాధులకు గురై మృత్యువాతపడుతున్నారని చెప్పారు. వెంటనే సాగర్ జలాలను సరఫరా చేయాలని కోరుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఎ.కొండూరు నుంచి విజయవాడ కలెక్టరేట్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర జరుగుతుందన్నారు. ప్రజలు ఈ పాదయాత్రలో అధికసంఖ్యలో పాల్గొని తాగునీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు నృసింహాద్రి వనమాలి, తూము కృష్ణయ్య, షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

మృత్యు గుంతలు

తవ్వి వదిలివేసిన సిబ్బంది


మరమ్మతుల కోసం తవ్వి పూడ్చకుండా వదిలేసిన గుంతలు

జి.కొండూరు: నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం వాహనదారుల పాలిట శాపంగా మారింది. ఇబ్రహీంపట్నం నుంచి చత్తీస్‌ఘడ్ వరకు ఉన్న 30వ నంబరు జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి మైలవరం వరకు 20 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ వాహనాల రాకపోకల వల్ల అక్కడక్కడా రహదారిపై గుంతలు ఏర్పడడంతో పాటు ఓవర్‌లోడు కారణంగా లారీలలో కంకర రాళ్లు జారి రహదారిపై పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

రహదారి నిర్వహణపై నిర్లక్ష్యం..

ఈ రహదారి నిర్వహణను హైవే అధికారులు గాలికొదిలేయడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పదుల సంఖ్యలో వాహనదారులు ప్రాణాలు కోల్పోవడంతో పాటు ఎందరో క్షతగాత్రులుగా మారుతున్నారు. జి.కొండూరు శివారులోని బైపాస్ రహదారిలో పులివాగుపై ఉన్న వంతెన వద్ద గుంతలు ఏర్పడి కొన్ని నెలలుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల గుంతలను పూడ్చేందుకు వాటిని వెడల్పుగా తవ్విన సిబ్బంది పూడ్చకుండా అలాగే వదిలివేశారు. కనీసం హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేయకుండా వదిలి వేయడంతో రాత్రి సమయంలో గుంతలు కనిపించక మైలవరం నుంచి విజయవాడ స్కూటీపై వెళ్తున్న యువతీ, యువకుడు అదుపు తప్పి కింద పడిపోయారు. వీరికి తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనతో స్పందించిన స్థానిక ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ ఆ గుంతల చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేసి రేడియం రిబ్బన్లను కట్టించారు. హైవే అధికారులు స్పందించి గుంతలను పూడ్చడంతో పాటు హైవే నిర్వహణను సక్రమంగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

గంగానమ్మకు బోనాలు



ఇబ్రహీంపట్నం: శ్రావణమాసం సందర్భంగా పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని గంగానమ్మ అమ్మ వారికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. బోనాలు తలపై పెట్టుకుని సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో కోలాహలంగా గ్రామోత్సవం జరిపారు. గంగానమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వడ్డెర సహకార సంఘ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఒకే రోజు నలుగురికి సాధారణ ప్రసవం

గంపలగూడెం: గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు మహిళలకు ఆదివారం సాధారణ కాన్పులు చేశామని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శృతి తెలిపారు. గంపలగూడెంకు చెందిన గర్భిణులు కె. జయశ్రీ (20), కె అంజలి (20), మేడూరుకు చెందిన జి. మానస (20), తెలంగాణ ప్రాంతానికి చెందిన కె. లక్ష్మి డెలివరీ కోసం ఆస్పత్రికి వచ్చారు. ఒకేరోజు వచ్చిన నలుగురికి వైద్యులు శృతి, సిబ్బంది కలిసి సాధారణ కాన్పు చేయడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

బోనస్ పంపిణీ

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): కృష్ణా మిల్క్ యూనియన్ విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి, చంద్రుపట్ల గ్రామాల్లో పాడి రైతులకు మొదటి విడత బోనస్‌లను ఆదివారం అందజేశారు. తెల్లదేవరపల్లి సంఘంలో పాడి రైతులకు రూ.61,470, చంద్రుపట్ల సంఘంలో రూ.83,190 బోనస్‌ను మేనేజర్ టి. సాంబశివమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ బి. నరేష్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘ అధ్యక్షులు రాయల లక్ష్మీ, చిల్లపల్లి భాగ్యమ్మ, సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు, వేతన కార్యదర్శులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి

జి.కొండూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగితే ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చి దిద్దే అవకాశం ఉంటుందని ఈఓపీఆర్డీ భారతి అన్నారు. జి.కొండూరు కమ్యూనిటీ హాల్‌లో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, సర్పంచ్‌లు, కార్యదర్శుల హక్కులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ముత్యాలమ్మకు పూజలు

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణమాసం ఆదివారం సందర్భంగా గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంపలగూడెం, పెను గొలను, ఊటుకూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, సమర్పించి మొక్కుకొన్నారు. ఇళ్ల వద్ద పొంగలి, వంటకాలను తయారు చేసుకొని తెచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

లక్ష్మీనరసింహుని కల్యాణం

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహుని ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని కొండపై ఉన్న ఎగువ సన్నిధిలో మూలవిరాట్‌కు స్నపన, విశేష అలంకరణ, సహస్ర నామార్చనలు చేశారు. దిగువ సన్నిధిలో స్వామివార్లకు మూల మంత్రం కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తిరువూరు సీఐ గిరిబాబు


దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ గిరిబాబు

తిరువూరు: వాహన చోదకులు, దుకాణదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తిరువూరు సీఐ గిరిబాబు కోరారు. ఆదివారం పట్టణంలోని బోస్ సెంటర్ నుంచి చీరాల సెంటర్ వరకు ట్రాఫిక్ సమస్యను ఎస్ఐ సత్యనారాయణతో కలిసి సీఐ పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో, డ్రెయినేజీలపై ఎటువంటి ఆక్రమణలకు పాల్పడినా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు ప్రతి వాహన చోదకుడూ పాటించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, అధికవేగంతో వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.